అనుదినం.. జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 07 ఫిబ్రవరి 2023

మహిళలు రోడ్డెక్కినా స్పందించరా.?

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

పావుల వడ్డీ రుణాల కోసం మహిళలు రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతున్నా పట్టించుకోరా అని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. మహిళలు రోడ్డుపైనే వంట చేసి భోజనం చేశారు. మహిళా సంఘాలకు రావలసిన వడ్డీ లేని రుణాలు, స్త్రీ నిధి వడ్డీ బకాయిలు, అభయ హస్తం డబ్బులు చెల్లించే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని తెలిపారు.


రోడ్డుపైనే మహిళల భోజనం

బోధన్‌లో దూందాం

నవతెలంగాణ-బోధన్



బోధన్ ను జిల్లాగా ప్రకటించాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 50 రోజులకు చేరుకోవడంతో రిలే దీక్షల వద్ద కళాకారులు దూందాం నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జనంపాట ధూంధాం కళా బృందం ఆధ్వర్యంలో ఆలపించిన కళాకారుల ఆటపాట అలరించాయి. కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, కలీం, సీపీఐఎంఎల్ నాయకులు మల్లేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, న్యాయవాదులు శ్రీనివాస్, హన్మంత్ రావు దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.


జర్మని దేశ దంపతులకు బాలికను అప్పగించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్

జర్మనీ దంపతులకు బాలిక దత్తత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జర్మనీ దేశానికి చెందిన దంపతులకు పాపని దత్తత ఇచ్చారు. ఐడిఓసిలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా ఐదు సంవత్సరాల పాపని దత్తత ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దత్తత తీసుకున్న భార్యాభర్తలని అభినందించారు. పాపని జాగ్రత్తగా చూసుకోవాలని మంచి పౌష్టికాహారం, విద్య అందించాలని మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, బాలలక్షాభవన్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్యకుమార్, శిశు గృహ మేనేజర్ అనిత సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికుడి ఆత్మహత్య

- అప్పులు తీర్చే మార్గం లేక ఉరేసుకొని బలవన్మరణం

నవతెలంగాణ-భిక్కనూర్



పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లాడు. మూడేండ్లు పని చేయగా.. అక్కడి కంపెనీ మూతపడటంతో తిరిగి వచ్చేశాడు. ఈ క్రమంలో గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీరకపోగా, ప్రస్తుతం పని లేక మరింత అప్పులు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై చెట్టుకు ఉరేసుకొని ఓ గల్ఫ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని జంగంపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగంపల్లి గ్రామానికి చెందిన ప్రణయ్ కుమార్ (31) గత మూడు సంవత్సరాల క్రితం పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లాడు. తాను పనిచేస్తున్న కంపెనీ మూత పడటంతో తిరిగి వచ్చాడు. ఈ క్రమంలో చేసేందుకు పని లేక దాబా హెూటల్లో కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గల్ఫ్‌కు వెళ్లిన క్రమంలో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్థాపానికి గురవుతుండేవాడు. ఈ క్రమంలో దాబాలో పనికి వెళ్తున్నా అని చెప్పి ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులో వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్ట ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బడ్జెట్‌పై విపక్షాల పెదవివిరుపు..

- పాత పథకాలకే కేటాయింపు
- నిరుద్యోగభృతి, గిరిజనబంధుపై మౌనం
- ఇంటిసాయం 3 లక్షల ప్రకటన
- ఖర్చులు నామమాత్రం : సీపీఐ(ఎం)
- సంక్షేమ బడ్జెట్ : బీఆర్ఎస్
- రైతులను మరోసారి వంచన : కాంగ్రెస్

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి


అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెడుతున్న ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై విపక్షాలు, ప్రజాసంఘాలు పెదవి విరిచాయి. కేటాయింపులు ఘనంగా చూపి.. ఖర్చులు చేయడం లేదని సీపీఐ(ఎం) విమర్శించింది. మరోసారి రాష్ట్ర సర్కారు రైతులను వంచించిందని కాంగ్రెస్ ఆరోపించింది. కాగా రాష్ట్ర సర్కారు ప్రజా సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అధికార పార్టీ నాయకులు పేర్కొన్నారు. 2022-23 సంవత్సరానికి మొత్తం రూ.2,90,396 కోట్లతో ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావు బడ్జెట్ ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం 2,11,685 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఆయిల్ ఫామ్‌కు రూ.1000 కోట్లు, నీటి పారుదల రంగం రూ.26, 885 కోట్లు, విద్యుత్ రంగం 12, 727 కోట్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ కు 3,117 కోట్లు, ఆసరా పింఛన్లు 12,000 కోట్లు, దళిత బంధు 17,700 కోట్లు, గిరిజన సంక్షేమం.. షెడ్యూల్ తెగల ప్రత్యేక ప్రగతి నిధి కింద రూ.15,233 కోట్లు, బీసీ సంక్షేమం 6,229 కోట్లు, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ రూ.3,210 కోట్లు, మహిళా శిశు సంక్షేమం 2,131 కోట్లు, మైనార్టీ సంక్షేమం రూ.2200 కోట్లు, రాష్ట్రంలో మరో 60 జూనియర్, సీనియర్ సివిల్ జిల్లా జడ్జి కోర్టు ల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలంగాణకు హరితహారం రూ.1,471 కోట్లు, వైద్య ఆరోగ్య రంగం 12, 161 కోట్లు, పల్లె ప్రగతి... పంచాయతీ రాజ్ శాఖకు రూ.31, 426 కోట్లు, పురపాలక శాఖకు రూ.11, 372 కోట్లు, రోడ్లు భవనాలకు 2,500 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.4,037 కోట్లు, శాఖకు 9,599 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.26,831 కోట్లు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ కోసం రూ.200 కోట్లు, కొత్తగా నియమించబడే ఉద్యోగుల జీతభత్యాల కోసం రూ.1000 కోట్లు, ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ, సెర్ప్ ఉద్యోగుల పే స్కెల్ సవరణ గురించి బడ్జెట్‌లో ప్రకటించారు.

ఈ యేడాది ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో రాష్ట్ర సర్కారు సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసింది. ముఖ్యంగా ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, పంచాయతీలకు నిధులపై కేంద్రీకరించింది. మెజార్టీ ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు జరిపింది. అయితే నిరుద్యోగ భృతిపై పలుమార్లు ప్రకటనలు చేసినప్పటికీ.. సర్కారు ఆ ఊసెత్తలేదు. దళితబంధు ప్రకటన నేపథ్యంలో గిరిజనబంధు డిమాండ్ ప్రధానంగా వచ్చింది. దీనిపై అధికార పార్టీ నేతలు స్పందించారు. కానీ ఇందులో గిరిజన బంధుకు సంబంధించి ప్రకటన చేయలేదు. కాగా ఖాళీస్థలం ఉంటే ఇండ్లు నిర్మించుకునేందుకు గతంలోరూ.5 లక్షలు అందజేస్తామని ప్రకటించిన సర్కారు.. దాన్ని మూడు లక్షలకు కుదించింది. ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది.

సంక్షేమ పథకాలకు బడ్జెట్లో నిధులను పెంచాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు తగినన్ని నిధులు కేటాయించలేదు. గతంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను పెంచటానికి సరైన ప్రతిపాదనలు చేయలేదు. నిరుద్యోగ భృతికి కావాల్సిన నిధులను కేటాయించలేదు. ధరలకు అనుగుణంగా పెన్షన్లను పెంచవలసిన అవసరం ఉంది. పంటలకు బోనస్ ఇవ్వడానికి నిధులను కేటాయించలేదు. మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలకు నిధులను పెంచాలి. నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను రైతాంగాన్ని నిరాశ కలిగిస్తుంది. తెలంగాణ యూనివర్సిటీకి తగినన్ని నిధులు కేటాయించలేదు. విద్యారంగంలో మౌలిక సదుపాయాలను పెంచటానికి నిధులు పెంచాల్సిన అవసరం ఉంది. డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఐదు లక్షలకు కేటాయించడంలో వైఫల్యం చెందింది. ఇప్పటికైనా బడ్జెట్లో మార్పులను చేసి ప్రజా అవసరాలను దష్టిలో పెట్టుకొని బడ్జెట్‌లో

సకల జనుల బడ్జెట్ :

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు బడ్జెట్ ప్రవేశపెట్టాలరని, ఇది ముమ్మాటికీ సకల జనుల సంక్షేమానికి దోహదం చేస్తుందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అభివర్ణించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు పెద్దపీట వేశారని, ఏ ఒక్క వర్గాన్ని విస్మరించకుండా నిధుల కేటాయింపులు జరిగాయని, తెలంగాణ రాష్ట్రంలో జోడెడ్ల మాదిరిగా అభివద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయనడానికి ఈ బడ్జెట్ సాక్ష్యం అని ఆయన అన్నారు. తెలంగాణకు నయాపైసా ఇవ్వకుండా నయవంచన చేస్తున్న కేంద్రం వివక్షను రాష్ట్ర బడ్జెట్ బద్దలు గొట్టిందన్నారు. సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణం కోసం 12 వేల కోట్లు కేటాయించడం గొప్ప విషయం అన్నారు.

రైతులను మరోసారి వంచించిన కేసీఆర్

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి



రాష్ట్ర సర్కారు మరోసారి రైతులను మోసం చేసిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. రూ.20వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీకి అవసరం ఉంటే రూ.6వేల కోట్లు మాత్రమే కేటాయించడం అనేది రైతుల్ని కేసీఆర్ దగా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు బకాయిదారులుగా ముద్ర పడడం జరిగిందని పేర్కొన్నారు. బడ్జెట్లో దళిత బందుకు నిధులు కేటాయించడంలో తప్ప ఖర్చు చేస్తూ అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని తెలిపారు. ఈ విధంగా అన్ని రంగాలలో మసిబూసి మారేడు కాయ చేసి ప్రజలను మోసం చేయాలని సర్కారు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

వృద్ధాశ్రమానికి నిరాశ్రయురాలు

నవతెలంగాణ కథనంతో స్పందించిన అధికారులు


అవ్వ.. జర బువ్వ పెట్టవా

నవతెలంగాణలో ప్రచురితమై కథనం..


వృద్ధురాలిని తరలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-భిక్కనూర్

ఇల్లు కాలి, కూలిపోయి నిరాశ్రయులైన వృద్ధురాలి దీనస్థితిని నవతెలంగాణ దినపత్రికలో "అవ్వ.. జర బువ్వ పెట్టవా" శీర్షికతో సోమవారం కథనం ప్రచురించడంతో డిడబ్ల్యూవో అధికారులు స్పందించారు. మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో స్థావరం ఏర్పరచుకున్న బాలమణి అనే వృద్ధురాలని డిడబ్ల్యూఓ కార్యాలయం నుండి ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నరేష్ వచ్చి కామారెడ్డి జిల్లా కేంద్ర శివారులో ఉన్న వృద్ధాశ్రమంలో చేర్పించారు. అభాగ్యురాలి గోడును వెలికి తీసి అధికారుల్లో కదలిక తెచ్చేలా కథనం ప్రచురించిన 'నవతెలంగాణ' స్థానికులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతిరెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్, కరోబార్ రాందాస్, తదితరులు ఉన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలి

- జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్ ఈఎస్ఐ కల్పించాలి
- పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్

నవతెలంగాణ-కంఠేశ్వర్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు, జీపీ కార్మికులు

గ్రామ పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి కారోబార్, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ కల్పించి వారిని అసిస్టెంట్ కార్యదర్శిలుగా నియమించి ప్రభుత్వ గ్రాంట్ ధర వేతనాలు చెల్లించాలని, సిబ్బందికి, కార్మికులకు ఉద్యోగ భద్రత పిఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలు అమలు చేయాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల రాష్ట్ర బందం ఆధ్వర్యంలో తలపెట్టిన పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. అంతకుముందు కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మికుల సమస్యల పరిష్కారం డిమాండ్ల సాధన కోసం పోరాటాల పురిటి గడ్డ వీరనారి చిట్యాల ఐలమ్మ స్వగ్రామమైన పాలకుర్తి నుంచి ఈనెల 12న పాదయాత్రను ప్రారంభించనున్నట్టు తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులు సుదీర్ఘకాలం పోరాటం చేస్తే ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదిక లేకుండా అశాస్త్రీయంగా జీవో నెంబర్ 51 తెచ్చిందన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూపాయలు 16500. కారోబార్ బిల్ కలెక్టర్లకు 19500. కంప్యూటర్ ఆపరేటర్లకు 22,750 వేతనం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సాగర్ గంగారం, పసియోద్దీన్, సాయిలు, మాధవ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాదయాత్ర జయప్రదానికై పాటల సీడీని ఆవిష్కరించారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి శిల్ప లింగం రచన గానం చేశారు.

పిట్లం ఎస్ఐగా విజయ్‌కొండ

నవతెలంగాణ-పిట్లం


ఎస్ఐ విజయ్ కొండ

పిట్లం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విజయ్ కొండ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, సైబర్ నేరాలపై సిబ్బంది సహకారంతో అదుపులో ఉండేలా కృషి చేస్తామని చెప్పారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రంజిత కుమార్ మెదక్ జిల్లా రామాయంపేట్‌కు బదిలీపై వెళ్లిన విషయం విధితమే. పెద్దకొడప్‌గల్ నుంచి ఎస్ఐ విజయ్‌కొండ బదిలీపై పిట్లం వచ్చారు. ఎస్ఐకి ఏఎస్ఐ లింబాద్రి , సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

పొద్దంత ఎండ.. పొద్మికి చలి

- తేమ శాతం కోసం శనగ రైతుల పాట్లు
- పంటను ఎండబెడుతున్నా.. రాని తేమ శాతం
- కొనుగోలు కేంద్రాలెన్నడో.. దండుకుంటున్న దళారులు

నవతెలంగాణ-మద్నూర్


శనగపంటను ఆరబెడుతున్న రైతులు

వాతావరణంలో మార్పుతో శనగ రైతులకు పాట్లు తప్పడం లేదు. తేమ శాతం కోసం పంటను ఆరబెడుతుండగా.. పొద్దంత ఎండ కాస్తూ.. సాయంత్రం వేళ చలి తీవ్రత పెరుగుతుండటంతో పంటకు నిమ్ము వచ్చి తేమ శాతం అమాంతంగా పెరిగిపోతోంది. పంట చేతికి వచ్చి దాదాపు 20 రోజులవుతున్నా.. ప్రభుత్వం ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు దండుకుంటున్నారు. పంటను నిల్వ ఉంచేంత స్థలం లేక.. తేమ శాతం రాక రైతులు ఇక్కట్లు పడుతున్నారు .దీన్ని అదునుగా తీసుకొని మద్దతు ధర కంటే 700 నుంచి 800 రూపాయలు తక్కువగా చెల్లిస్తూ పంటను వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే దిగుబడి తగ్గిందని, దీనికి తోడు ధరలో కోతలు విధిస్తుండటంతో కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు వాపోతున్నారు.

మద్నూర్ మండల వ్యాప్తంగా శనగ పంట సాగు ప్రతేటా తగ్గుతూ వస్తోంది. 30 నుంచి 35 వేల ఎకరాలు సాగు చేస్తుండగా.. ఈసారి అమాంతంగా తగ్గి సుమారు 21 వేల ఎకరాల్లో సాగైంది. దిగుబడులు తగ్గడం, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ధర రాక పెట్టుబడులు సైతం తిరిగిరాని పరిస్థితి నెలకొంది. దీంతో పంట సాగు క్రమంగా తగ్గుతోంది.

తగ్గిన దిగుబడి..

ఈసారి పంట దిగుబడి తగ్గినట్టు రైతులు వాపోతున్నారు. ఎకరానికి దిగుబడి ఎనిమిది క్వింటాల నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా 5 నుంచి 6 క్వింటాళ్ల వరకే దిగుబడి రావడంతో శనగ పంట రైతులు దిగులు చెందుతున్నారు. సర్కారు మద్దతు ధర రూ.5350 నిర్ణయించగా, ఉండగా ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. పంట చేతికి వచ్చి 20 రోజులవుతున్నా.. వాటి జాడ లేదు.

తేమ శాతం కోసం పాట్లు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీన్ని అదునుగా భావిస్తున్న వ్యాపారులు.. తేమ శాతం పేరుతో ధరను తెగ్గోస్తున్నారు. 4500 నుంచి 4700 చెల్లిస్తూ క్వింటాకు 800 నుంచి 500 వరకు రైతులను దగా చేస్తున్నారు. తేమ శాతం కోసం రైతులు శనగ పంటను ఆరబెడుతుండగా.. పొద్దంత ఎండు కాస్తూ, సాయంత్రం వేళ చలి తీవ్రత పెరుగుతుండటంతో నిమ్ము వచ్చి తేమ శాతం అమాంతంగా పెరుగుతోంది. దీంతో పొద్దంత పంటను ఎండబెట్టేందుకు రైతుల చేస్తున్న శ్రమ బుడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఇప్పటికే పంట దిగుబడి తగ్గిందని, పెట్టుబడుల ఖర్చులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ధర రాకపోవడంతో పెట్టుడులు సైతం తిరిగి రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పంట కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

రాజు ఏవో మద్నూర్

మద్దతు ధరతో శనగ పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై పై నుంచి ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేవు. ప్రస్తుతం పంట చేతికి వచ్చినందున నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తాం. పంట మార్పిడి చేపట్టకపోవడంతో శనగ పంట దిగుబడి క్రమంగా తగ్గుతోంది. ఈసారి పంట మార్పిడి విధానం అవలంభిస్తే మేలు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తాం.

కరెంటు తీగలు తొలగించాలని వినతి

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెగడపల్లి గ్రామంలో గల ఇందిరమ్మ కాలనీలో హై టెన్షన్ విద్యుత్ వైర్లు ఇండ్లపై నుంచి పోతున్నందున వాటితో ప్రమాదం పొంచి ఉందని, కావున వాటిని తక్షణమే తొలగించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో 11 కెవి విద్యుత్ వైర్లు ఉండడం వల్ల కరెంటు వైర్లు తెగిపోయిన షాట్ సర్క్యూట్ అవుతుందన్నారు. విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మహిళలతో పాటు టిఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ రవి, ముజీబ్, కాలనీ మహిళలు సరళ, అబ్బవ్వ, ముంతాజ్, భాను బి తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు మనబడి పనులు తనిఖీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఫతేపూర్ గ్రామంలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో జరుగుతున్న మన ఊరు మన బడి పనులను సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ రాజా గంగారం, సర్పంచ్ కొత్తపల్లి లక్ష్మి లింబాద్రి, ప్రధానోపాధ్యాయుడు ,,ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు..



కేటాయింపులు ఘనం

ఖర్చులు నామమాత్రం

- సీఎం హామీలకు బడ్జెట్ ఏది?
- రాష్ట్ర బడ్జెట్‌పై పలువురి అసంతృప్తి

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించారని విద్యార్థిసంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తంచేశారు. సరిపడే బడ్జెట్ కేటాయించకపోతే విద్యారంగం ఎలా అభివృద్ధి చెందుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. సీఎం ఇచ్చిన హామీలకు బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. బీసీలకు బడ్జెట్‌లో మొండిచేయిచూపారని బీసీ సంఘ నాయకులు అసహనం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-విలేకరుల బృందం

విద్యారంగానికి నిధులు తగ్గిస్తున్నారు..

టీఎస్‌యూటీఎఫ్

విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కొద్ది సంవత్సరాలుగా నిధులు తగ్గిస్తూ వస్తుందని, 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సత్యానంద్ సోమవారం తెలిపారు. సెకండరీ, ఉన్నత ఎడ్యుకేషన్‌కు రూ.19093 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఇది మొత్తం బడ్జెట్లో 6.57 గా ఉందని అన్నారు. మన ఊరు-మనబడి లో భవన నిర్మాణం, ఎలక్ట్రిసిటీ, ప్రహరీల నిర్మాణం, టాయిలెట్స్‌కు సంబంధించి నిధులు పూర్తిగా కేటాయించకపోవడం వల్ల పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)లో నామమాత్రం గా 362 కోట్లు కేటాయించారని, ఆస్పత్రుల్లో టెస్టుల కోసం కనీస పరికరాలు లేవు.. మందులు సరిపోను ఇవ్వడం లేదు.. డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని, కార్పొరేట్ వైద్యం కాకపోయినా నాణ్యమైన వైద్యం అందించాలని అన్నారు. తక్కువ కేటాయింపులు చేస్తూ ఉపాధ్యాయ ఉద్యోగుల జీతాల్లో కోతపెట్టే విధంగా ప్రభుత్వ ఆలోచనలు ఉన్నాయని తెలిపారు. బాలికలకు గతంలో కేసీఆర్ కిట్ అంటూ శానిటరీ కిట్లు అందించేవారు. ఇప్పుడు అవి లేవు ప్రతినెల విద్యార్థులకి అవసరమైన అన్ని వస్తువులతో కిట్లను అందించాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు వేతనాల కోసం 15వ తేదీ వరకు వేచి చూసే విధంగా కాకుండా మొదటి తేదీన జీతాల చెల్లింపులు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని తెలిపారు.

- కంఠేశ్వర్

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

రాష్ట్ర బడ్జెట్ లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుమారు మూడు లక్షల కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 19 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ బడ్జెట్ కేవలం జీతభత్యాలకే సరిపోతుంది తప్ప విద్యారంగ అభివద్ధికి ఏమాత్రం సరిపోదు, బడ్జెట్‌లో యూనివర్సిటీలకి సరిపడా నిధులు ఇవ్వలేదు. తక్కువ నిధులు కేటాయించడం అంటే కేవలం కార్పొరేట్ విద్యను పెంచిపోషించటమే. బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి.

-నిజామాబాద్‌సిటీ

ఇంటింటికి ఉద్యోగం హామీకి బడ్జెట్ లేకపోవడం శోచనీయం

సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

ఇంటింటికీ ఉద్యోగం అని హామీ ఇచ్చి ఈ బడ్జెట్లో కేటాయింపులు లేకపోవడం శోచనీయం. 2014లో తెలంగాణ ఉద్యమంలో కల్వకుంట్ల.చంద్రశేఖర రావు ఇచ్చిన హామీ ప్రకారం ఇంటింటికి ఉద్యోగం అని చెప్పిన హామీ ఇచ్చినప్పటికీ గడిచిన బడ్జెట్లలో నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్ లోనైనా ఉద్యోగాల భర్తీ కోసం నిధులు కేటాయిస్తారేమోనని గంపెడాశతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు నిరాశే మిగిలింది. ఢిల్లీ, కేరళ రాష్ట్రాల మాదిరిగా విద్యా, వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్య పేదలకు ఉచిత వైద్యం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కులాలకు-కులాలకు మధ్యన ఘర్షణ పెట్టి ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ కేటాయించకపోవడం అన్యాయం. -నిజామాబాద్‌సిటీ

టీయూకి అధిక నిధులేవి..?

జీవియం విఠల్ -భారతీయ విద్యార్థి మోర్చా (బివిఎం)-రాష్ట్ర కార్యదర్శి-తెలంగాణ యూనివర్సిటీ

తెలంగాణ యూనివర్సిటీని అభివద్ధి చేయాల్సిన ప్రభుత్వం అరకోరా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుంది. తెలంగాణ యూనివర్సిటీ అభివద్ధి కావడానికి 100 కోట్లు అవసరం ఉండగా కంటి తుడుపుగా నిధులను కేటాయించింది. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాల్సిన ప్రభుత్వం 6 శాతానికి పరిమితం చేయడం అంటే విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్ కార్పొరేట్ వ్యవస్థకు కట్టబెట్టాలని ప్రభుత్వం కుట్ర పన్నుతుంది. యూనివర్సిటీకి 500 కోట్లు విడుదల చేయాలి. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలి.

- డిచ్‌పల్లి

రాష్ట్ర బడ్జెట్లో సెర్ప్ ఉద్యోగుల పేస్కేలు ప్రకటించడం హర్షనీయం

-సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట అధ్యక్షుడు కుంట గంగాధర్ రెడ్డి



సెర్ప్ ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి పే స్కేల్ వర్తింప చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కమ్మర్ పల్లి ఏపిఎం కుంట గంగాధర్ రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో గ్రామీణ అభివద్ధి కార్యక్రమాల అమలులో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్న తమకు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతత్వంలో తగిన గుర్తింపు దక్కుతోందని పేర్కొన్నారు. పేస్కేలు ద్వారా సెర్ప్ సంస్థలో పనిచేస్తున్న 3974 మంది ఉద్యోగులకు లబ్ది చేకూరనుందని తెలిపారు. ప్రస్తుతం వేతనాలకు ఏటా రూ.192 కోట్ల బడ్జెట్ ఉండగా దీనికి మరో 42 కోట్లు అదనంగా రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడనుంది తెలిపారు. గత సంవత్సరం మార్చి 15న సెర్ప్‌ఉద్యోగులకు పేస్కేల్ వర్తింప చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. ఇదిలా ఉండగా గత 2018 ఎన్నికల సందర్భంగా సెర్ప్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని మేనిఫెస్టోలో చేర్చడంతో పాటు తదనంతరం ఉభయసభల సమావేశంలో గవర్నర్ ప్రసంగంలో కూడా చేర్చిందని గుర్తు చేశారు.

- కమ్మర్‌పల్లి

మహిళా సంక్షేమం మరిచారు

ఐద్వా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బని లత



బడ్జెట్‌లో మహిళా సంక్షేమం మరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన దాదాపు మూడు లక్షల కోట్ల బడ్జెట్లో మహిళా సంక్షేమం కోసం కేటాయించిన బడ్జెట్ నామమాత్రంగానే ఉందని. పొదుపు, డ్వాక్రా, గహ నిర్మాణం, విద్యా, వైద్యం కోసం కేటాయింపులు. మహిళలను నిరాశ పరిచాయి.

-నిజామాబాద్ సిటీ

ఎమ్మెల్యేల జోక్యం లేకుండా దళిత బంధు ఇవ్వాలి

ఎమ్మెల్యేల జోక్యం లేకుండా దళిత బంధు అర్హులకు ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్లో దళితుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన దళిత బంధు పథకానికి కేటాయించిన 17,700 కోట్లు నిధులను అర్హులైన దళిత నిరుపేదలకు నేరుగా అందజేయాలని తెలిపారు. గత బడ్జెట్లో మిగిలిన నిధులను ఈ సంవత్సరం అందజేయాలి.

-నిజామాబాద్‌సిటీ

బలహీన వర్గాలకు బడ్జెట్‌తో తీవ్ర నిరాశ

మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

రాష్ట్ర బడ్జెట్ బడుగు బలహీన వర్గాలకు తీవ్ర నిరాశ కలిగించింది మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టే చివరి బడ్జెట్ కావడంతో ప్రజలు ఎన్నో అంచనాలు పెట్టుకున్నారని అన్నారు. అయితే, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు విద్య, వైద్యం లేదా సంక్షేమం వంటి ప్రధాన రంగాలకు తగినంత కేటాయింపులు చేయకపోవడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలను నిరాశపరిచారని ఆయన అన్నారు. ఇంకా బడ్జెట్‌లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీల సంక్షేమాన్ని విస్మరించారని అన్నారు. మొత్తం బడ్జెట్‌లో ఎస్సీలకు 7.23 శాతం, ఎస్టీలకు కేవలం 1.3శాతం, బీసీలకు 2.14శాతం, మైనారిటీల సంక్షేమానికి 0.75 శాతం మాత్రమే కేటాయించారు. వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న పథకాల అమలుకు ఈ కేటాయింపులు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు.



కామారెడ్డి టౌన్

జిల్లాకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం తగదు

జిల్లాకు బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అని బీడీఎస్‌ఎఫ్ నాయకులు విట్టల అన్నారు. కామారెడ్డి జిల్లాని కెసిఆర్ ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తామని మాట ఇచ్చి కామారెడ్డి జిల్లాలో యూనివర్సిటీ , ఇంజనీరింగ్ కాలేజ్, పాలిటెక్నిక్ ,ఒకేషనల్ కోర్సెస్ ,నర్సింగ్ కాలేజ్ ఐటీఐ కళాశాలలు కేటాయిస్తామని చెప్పి కేసీఆర్ మాట తప్పారు అని అన్నారు. నాలుగు జిల్లాలకు రెండు రాష్ట్రాలకు సరిహద్దు అయిన కామారెడ్డి జిల్లాకు బడ్జెట్లో మొండి చేయి చూపడం దురదృష్టం. పెండింగ్లో ఉన్న 3500 కోట్లు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయకపోవడం దుర్మార్గమైన చర్య. కామారెడ్డిటౌన్

కంటి వెలుగు నిరంతర ప్రక్రియ



కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోగల గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ బట్టు హనుమాన్లు, ఎంపీటీసీ సభ్యురాలు వనజ నాగరాజు, ఉపసర్పంచ్ కుంట శ్రీనివాసులు సోమవారం ప్రారంభించారు. కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. రోజుకు 100 మందిని మాత్రమే పరీక్షించి అద్దాలతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేస్తామని వెంకటేష్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో పాటు సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ బట్టు హనుమాన్లు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. 15రోజులపాటు శిబిరం ఉంటుందని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎడపల్లి ఆయుష్ వైద్యాధికారి కోల వెంకటేష్, ఆస్పత్రి పాలనాధికారి రాములు, ఎంపీఓ సుభాష్ చంద్రబోస్, పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి, ఏఎన్‌ఎం శాంత. పంచాయతీ బిల్ కలెక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి :ఎంపీపీ



కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పస్కా నర్సయ్య అన్నారు. ఆలూరు మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి నిర్విరామ కృషితో పలు అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగులో పరీక్షలు చేసి కంటి అద్దాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆలూరు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ దమ్మాజీ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కళ్లెం బొజారెడ్డి, ఎంపీటీసీ మల్లేష్ గౌడ్, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ దత్తాద్రి, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్జెట్లో విద్యకు తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్లో విద్య రంగానికి సరిపడా నిధులు మంజూరు చేయక తీవ్ర అన్యాయం చేసిందని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. సోమవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో విద్యకు మరోసారి తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. గతంలో లాగే హరీష్ రావు బడ్జెట్ ప్రసంగం హంగు ఆర్భాటాలు, అంకెల గారడీ ప్రసంగం మాత్రమేనని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా చేసే కుట్రపూరిత బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. 6.57శాతంతో సరిపెట్టి మమా అనిపించారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆశుర్, నాయకులు సాయి కష్ణ, మురళి, కష్ణ వంశీ సంపత్, నంది, వినోద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీకి నిధులు పెంచాలని వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

ఉపాధిహామీకి కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మరియు రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బందం ఎంపీడీవో శ్రీనివాస్ కు సోమవారం వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీ పథకానికి కేటాయించిన అరకొర నిధులు పేదల కడుపు కొట్టే విధంగా ఉన్నాయని కనీసం ప్రతి వ్యక్తికి 200 రోజుల పని దినాలు 600 రూపాయల దినసరి కూలి వచ్చే విధంగా రెండు లక్షల 75 వేల నిధులను కేటాయించాలని యు. రాజన్న, ఏ.పీ. గంగారాములు డిమాండ్ చేశారు . కార్యక్రమంలో ఇస్తారి రమేష్ ,నిఖిల్ ,సురేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు

బడ్జెట్‌లో అభివృద్ధికి పెద్దపీట : జడ్పీ చైర్మన్



కంటిపరీక్షలను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ధర్మోర గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతు నాయకులు, రైతులకోసం పరితపించే కేసీఆర్ రైతాంగానికి, అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి రంగానికి బడ్జెట్ లో పెద్ద పీట వేసినందుకు కతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఆయనతో పాటు ఎంపీపీ మస్త ప్రభాకర్, ఎంపీడీఓ క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ సరిత, సర్పంచ్ శైలజ, ఎంపీటీసీ పురుషోత్తం రావు, గొట్టుముక్కుల సర్పంచ్ ప్రవీణ్, ఉపసర్పంచ్ చందు, బిఆర్ఎస్ నాయకులు సుక్కి సుధాకర్, గంగాధర్, అమత్, మల్లేష్, రవి పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి లక్ష విరాళం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ రామాలయానికి శోభ వెంకట్ రామ్ రెడ్డి దంపతులు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. గతంలో లక్ష రూపాయలు విరాళం అందచేయగా, సోమవారం మరో లక్ష రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాముల సాయిలు, గ్రామ కమిటీ సభ్యులు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎస్సీ కాలనీలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా, ఎంపీటీసీ ఎస్కే ఆహమ్మద్ లు సీసీ డ్రైనేజీ పనులను సోమవారం ప్రారంభించారు. జీపీ నిధులనుంచి ఐదు లక్షల రూపాయలను కేటాయించి పనులను పూర్తి చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కంఠం గంగారం, సంతోష్, గ్రామ కమిటీ అధ్యక్షులు భూమేష్, బుడ్డల సాయిలు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కేవీపీఎస్ వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్థానిక సమస్యలపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ ఆధ్వర్యంలో సో మవారం కలెక్టర్‌వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ... నిజామాబాద్ నగరంలోని రోటరీ నగర్ కాలనీలో నాలుగో నెంబర్ రోడ్డులో డ్రైనేజీ సమస్య ఉందని, మంచినీటి సౌకర్యం లేదని అన్నారు. నిరుపేద దళితులకు ఇంటి స్థలం ఉన్నవారికి ఐదు లక్షల నిర్మాణ ఖర్చు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జి.సాయిలు, టీ.సాయిలు, రమేష్, జ్యోతి, లక్ష్మి చక్రపాణి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నల్వాల్ నర్సయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని దేవక్కపేట్ గ్రామానికి చెందిన బాణావత్ శంకర్‌కు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ రెడ్డి 10 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన శంకర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో చేయి విరిగింది. అప్పటినుండి ఇంటివద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి పరామర్శించి 10 వేల రూపాయలను అందజేశారు. ఈయన వెంట సునీల్ యువసేన నాయకులు ఉన్నారు.

కంప్యూటర్‌ను ప్రారంభించిన ఎంపీపీ



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల నమోదు నిమిత్తం తెచ్చిన కొత్త కంప్యూటర్ ను ఎంపీపీ లావణ్య రామ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు కార్యాలయంలో ఇతర కంప్యూటర్లు ఉన్నప్పటికీ అదనంగా అవసరమైన కంప్యూటర్ పనుల నిమిత్తం కొనుగోలు చేసినట్టు ఎంపీపీ.,ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలావతి , సీనియర్ అసిస్టెంట్ రాజేష్, జూనియర్ అసిస్టెంట్ రవి, టి.ఏ దేవిసింగ్, కంప్యూటర్ ఆపరేటర్ పద్మావతి తదితరులు ఉన్నారు.

ప్రయివేటు పరం చేయడానికే ఆదాని గ్రూపులో పెట్టుబడులు

- ఎల్ఐసి, ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు ఆధ్వర్యంలో అదానీ గ్రూప్‌లలో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసి, ఎస్బిఐలతో పెట్టుబడులు పెట్టించి సామాన్య ప్రజల ధనం దుర్వినియోగం కావడానికి కారణమైన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిజామాబాద్ ఎల్ఐసి కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో అత్యంత లాభాలలో ఉన్న ఎల్ఐసి కంపెనీని ప్రైవేట్ పరం చేయడానికి చూస్తున్న మోడీ ఇప్పటికే 80వేల కోట్ల రూపాయలను అదాని గ్రూపులలో పెట్టుబడిగా పెట్టించాడరని, ఈ విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆదాని గ్రూప్ 40వేల కోట్ల రూపాయలు నష్టపోయిందని, అలాంటి గ్రూపులో ప్రభుత్వ సంస్థల ద్వారా పెట్టుబడి పెట్టించి వాటి నష్టానికి, సామాన్య ప్రజల దనం దుర్వినియోగం కావడానికి మోడీ ప్రభుత్వమే కారణమని అన్నారు. ఈసందర్భంగా పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హందాన్ మాట్లాడుతూ ఎల్ఐసి కంపెనీని ప్రైవేట్ పరం చేయడానికి బీజేపీ ప్రభుత్వం మోడీ నాయకత్వంలో నష్టపోయిన ఆదానీ గ్రూపులలో 80వేల కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టించారని, దీనిపై సుప్రీంకోర్టు న్యాయవాయదితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హమ్దాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి , జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భాగ్య, అన్ని విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి సహకరిస్తా

- జడ్పిటీసీ ఎర్రం యమునా ముత్యం

నవతెలంగాణ-నందిపేట్

మహిళలందరికీ తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని జడ్పిటీసీ ఎర్రం యమునా ముత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జడ్పిటీసీ భర్త ఎర్రం ముత్యంను మహిళా సంఘ పెద్దలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి భర్త ముత్యం మాట్లాడుతూ... జడ్పీ నిధులు రూ.. ఐదు లక్షలు మంజూరయ్యాయని, భవనానికి కావాల్సిన నిధులను ఏర్పాటు చేస్తానని హామీనిచ్చారు. మహిళా సంఘానికి ప్రహరీ గోడ పనులు పూర్తయ్యాయని, అదనంగా రేకుల షెడ్డుని నిర్మిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాద రవికుమార్, బలగం మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు గాండ్ల సంతోష్, చిన్నయ్య, ముత్యం మహిపాల్ పాల్గొన్నారు.



జడ్పీటీసీ భర్తను సన్మానిస్తున్న మహిళలు

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

- డాక్టర్ వినయ్ కుమార్

నవతెలంగాణ-రెంజల్

విధులను సక్రమంగా నిర్వర్తించాలని రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలకు, ఆశలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు డెలివరీ కోసం పంపిన వారిపై చర్యలు తప్పమన్నారు. కంటి వెలుగులో రెంజల్, నీల గ్రామాలలో ప్రతిరోజు 200 మంది కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏసీఈవోలు రవీందర్, శ్రావణ్ కుమార్, రాణి, మాలంబి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ వినయ్‌కుమార్

పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని మహమ్మదాబాద్ దళిత కాలనీలో మరికి కాలువల నిర్మాణ పనులను సర్పంచ్ సాయులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జీపీ నిధులతో గ్రామంలోని దళిత కాలనీలో మురికి కాలువల నిర్మాణం చేపట్టడం వలన శాశ్వత పరిష్కారం చేయడం వలన కాలనీ వాసులే నిర్మాణాలను దగ్గరుండి నిత్యం పరిశీలించాలని, నాణ్యతగా నిర్మించక పోతే జీపీ కార్యదర్శికి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నూతన మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండలం లోని భిక్కనుర్ గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు సోమవారం కామారెడ్డి కలెక్టర్ కు భిక్కనుర్ లో నూతన మత్స్య సొసైటీ ఏర్పాటు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ భిక్కనూర్ గ్రామ పరిధిలోని మల్లరెడ్డి చెరువు పై నూతన సొసైటీ ఏర్పాటు చేయాలని ఈ విషయంపై గతంలో ఏడికి వినతిపత్రాన్ని అందజేసినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు. మా సభ్యులకు చేపలు పట్టటంలో అనుభవం లో ఉంది కావున నూతన మత్స్య సొసైటీ ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ ఉప సర్పంచ్ శ్రీకాంత్, గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

- **సేవ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి**
- **విద్యార్థులతో కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ 2,3,4 ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రణాళిక బద్ధంగా విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని సూచించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని తెలిపారు. ఇష్టపడి చదివి తమకు నచ్చిన ఉద్యోగాన్ని పొందాలని చెప్పారు. ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొ న్నారు. సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కిష్టయ్య, జిల్లా ఇన్చార్జ్ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ఎస్సీ వసతి గృహం సంక్షేమ అధికారి నాగరాజు, శిక్షకుడు రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామన్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని పేర్కొన్నారు. మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయి.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కంటివెలుగుతో నేత్రసమస్యలు దూరం

- **శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **పలు చోట్ల ప్రారంభించిన ప్రజాప్రతినిధులు**



లింగంపేట్ మండలంలో..

నవతెలంగాణ-దోమకొండ/లింగంపేట్/పిట్లం

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల సోమవారం కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు.

దోమకొండ మండలం ముత్యంపేటలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం కంటి రోగులకు ఉచిత వైద్యం అందించడానికి కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చొరవతో కంటి వెలుగు కేంద్రాలన్నీ సజావుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, సర్పంచ్ సూర్య ప్రకాష్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, సొసైటీ చైర్మన్ తిరుపతి గౌడ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎం పి ఓ తిరుపతిరెడ్డి, వైద్యుడు వేణు మాధవ రావు, ఏపీవో రాజు, వార్డు సభ్యులు ఆశ బోయిన శ్రీనివాసు, మహేందర్ గౌడ్, సొసైటీ డైరెక్టర్లు, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లింగంపేట్ : లింగంపేట మండలంలోని అయ్యపల్లి గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శివమ్మ ఎంపీడీవో మల్లికార్జున్ రెడ్డి, ఎంపీఓ ప్రభాకర్ చారి సంయుక్తంగా ప్రారంభించారు.

పిట్లం : కంటివెలుగు శిబిరంలో కంటివైద్య పరీక్షలు నిర్వహించుకొని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజయ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత సెంటర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ నాయకులు , పంచాయితీ సెక్రెటరీ యాదగిరి , ప్రజలు పాల్గొన్నారు.

దేశాన్ని లూటీ చేస్తున్న మోడీ ప్రభుత్వం

- **ఎస్‌బీఐ ఎదుట కాంగ్రెస్ ధర్నా**

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశంలో కార్పొరేట్ కంపెనీల యజమానులకు అదాని అంబానీ లాంటి బడా పారిశ్రామికవేత్తలకు దేశాన్ని అమ్ముకుంటున్నారని, దేశాన్ని లూటీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఎల్లారెడ్డిలోని ఎస్‌బీఐ ఎదుట సోమవారం నాయకులు ధర్నా చేపట్టారు. బ్యాంకిం గ్ వ్యవస్థ , ఎల్‌ఐసి వ్యవస్థను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నాశనం చేసిందని, సామాన్య మానవు లకు నష్టాన్ని కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. సామాన్యుల కష్టార్జిత పొదుపు ఖర్చుతో తన సన్నిహితులకు, ఎంపిక చేసిన బిలియనీర్లకు లబ్ధి చేకూర్చేలా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో యావత్ దేశం, ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాలకిషన్, ఆఫీజ్, వైస్ ఎంపిపి నర్సింహులు, చిరంజీవులు, గోవింద్, యునుస్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

బీమాతో రైతు కుటుంబాలకు దీమా

నవతెలంగాణ-పిట్లం

బీమా కల్పించడంతో రైతులకు కటుంబాలకు అండగా నిలుస్తుందని మండల పరిషత్ వైస్ ఎంపీపీ లచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని చిల్లర్గి గ్రామానికి చెందిన రైతు బట్టు సాయిలు ఇటీవల మృతి చెందడంతో నామినీగా యున్న తమ్ముడు దత్తుకు అన్నారం రైతు వేదిక యందు సోమవారం 5 లక్షల రూపాయల బీమా ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రైతు బీమా పథకం దేశ వ్యాప్తంగా మరెక్కడా లేదని రైతు కుటుంబాలకు కెసిఆర్ అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం రైతు బంధు సమితి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశీరాం , బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు అన్నారం వెంకట్రాంరెడ్డి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ నాగంపల్లి మోహన్, హనుమంతరావు, సుదర్శన్, ఏఈఓ కావేరి, వీఆర్ఏలు , రైతులు పాల్గొన్నారు.



రైతు బీమా చెక్కు ప్రొసీడింగ్ అందజేస్తున్న వైస్ ఎంపీపీ

ప్రతి ఉపాధ్యాయుడు బయోమెట్రిక్ ఉపయోగించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాలలో బయోమెట్రిక్ ఉపయోగించాలని తాడువాయి ఎంఈఓ రామస్వామి తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉపాధ్యాయుడు ప్రతిరోజు బయోమెట్రిక్ ను ఉపయోగించాలని సూచించారు. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని తెలిపారు. విద్యార్థులకు కనీస విద్యా బోధన చేసి విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బయో టెక్నాలజీలో పరిశోధనకు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల పర్యవేక్షణలో 'ఇంప్రూవింగ్ డిఫెన్స్ రెస్పాన్సిస్ ఆఫ్ జెరీ బెరా జేమ్స్ సోనీ అగేనెస్ట్ వెస్టర్ పవర్ త్రిప్' అనే అంశంపై పరిశోధన చేసిన యం.ఎబెనెజర్ మౌఖిక పరీక్ష తెలంగాణ యూనివర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం నిర్వహించారు. ఈ మౌఖిక పరీక్షలో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా జెఎన్‌టియు కాకినాడ ప్రొఫెసర్ రమేష్ మాలోత్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యావర్ధిని, ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ ప్రొఫెసర్ రమేష్ మాలోత్ అడిగిన ప్రశ్నలకు పరిశోధక విద్యార్థి ఎబినేజర్ సమాధానాలు ఇచ్చారు. సంతృప్తి చెంది ఎక్సటర్నల్ పరిశోధకుడికి డాక్టరేట్‌ను ప్రకటించారు. బీఓఎస్ చైర్మన్ ప్రసన్న శీల, హెడ్, జవేరియా ఉజ్మ , సిఓఈ ప్రొఫెసర్ ఎం అరుణ, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీలోకి జమున రాథోడ్

- **ఎల్లారెడ్డి కాంగ్రెస్‌కు భారీ షాక్**

నవతెలంగాణ-లింగంపేట్



వైఎస్ఆర్‌సీపీలో చేరిన జమున వెంకట్ రాథోడ్

కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. పార్టీ మాజీ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ గిరిజన నాయకురాలు జమున రాథోడ్ సోమవారం వైయస్సార్ షర్మిల సమక్షంలో వైయస్సార్ పార్టీలో చేరారు. పార్టీ అధినేత్రి షర్మిల తో జమున రాథోడ్ ఆమె భర్త డాక్టర్ వెంకట్ వరంగల్‌లో భేటీ అయ్యారు. ఇందులో బాగానే పార్టీ చీఫ్ విప్ వైయస్ షర్మిల తో భార్యాభర్తలు భేటీ సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం షర్మిల సమక్షంలో వైఎస్ఆర్సిపి పార్టీలో చేరారు. దీంతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోలుకొని దెబ్బ తగిలినట్టయింది.

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తూ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పోచారం నుంచి యాచారం వరకు గిరిజనులతో పాటు మహిళలు అన్ని వర్గాల ప్రజలు మమేకమై తనకంటూ ఒక క్యాడర్ను సంపాదించుకుంది. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుండి ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి 20వేల ఓట్లకు పైగా సంపాదించారు.

ఎల్లారెడ్డి నియోజక వర్గంలో హస్తంలో మూడు ముక్కలాట సాగడంతో ఎవరికి వారే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు పోటాపోటీగా కొనసాగడంతో కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాల్లో తోడు ఎల్లారెడ్డి టికెట్ వస్తుందో లేదో అన్న అనుమానాలు వ్యక్తమై పార్టీ మారినట్టు సమాచారం.

కురుమ యువ చైతన్య సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-దోమకొండ



క్యాలెండర్ ఆవిష్కరణ

కురుమ యువ చైతన్య సమితి క్యాలెండర్‌ను కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దోమకొండ మండల కేంద్రంలో సోమ వారం ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురుమ సంఘము సోదరులు ఐక్యంగా రాజకీయంలో ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి నాయకులు జెడ్పిటిసిని సన్మానించారు. కార్యక్రమంలో కురుమ యువ చైతన్య సమితి కామారెడ్డి జిల్లా కార్యదర్శి పుల్ల గంగాధర్, మండల కురుమ సంఘం నాయకులు ఎన్నారం సాయిలు, పెద్దోళ్ల సాయిలు, బుచ్చమొల్ల శ్రీనివాస్, గూనోల్ల శ్రీనివాస్, ప్రవీణ్, పుల్ల నర్సింలు, శ్రీశైలం, రాజయ్య పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గాల్‌రెడ్డి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల వివాహం చేసిన కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి పథకంలో భాగంగా ఒక లక్ష 116 రూపాయల చెక్కును అందజేస్తున్నట్టు తెలిపారు. భిక్కనూర్ మండలం వ్యాప్తంగా 24 మంది లబ్ధిదారులకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, పట్టణ సర్పంచ్ తునికి వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతు రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ యాదగిరి, తసిల్దార్ ప్రేమ్ కుమార్, రైతుబంధు అధ్యక్షుడు రామచంద్రం, సిద్ధ రామేశ్వరం ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లెషం, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్ లు, ఎంపీటీసీలు, అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్దకొడప్ గల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఫిజియోథెరపీ ఉపాధ్యాయులు జై గంగాధర్, వైద్యులు దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయించి, వారి తల్లిదండ్రులకు రోజుఎలా చేయించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

విగ్రహప్రతిష్టాపన.. ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని మాధవపల్లి గ్రామంలో జరుగుతున్న రాజాశ్యామల యజ్ఞంలో, గుర్జల్ తండాలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేఏనుగు రవీందర్‌రెడ్డి సైతం పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూర్పు రాజులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీజేపీ మండల అధ్యక్షుడు చీమల్ వార్ సాయిబాబా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు ఫోన్ కాల్‌పై సీపీకి ఫిర్యాదు



సీపీకి ఫిర్యాదు చేస్తున్న కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

బెదిరింపు ఫోన్ కాల్ పై కోటపాటి సోమవారం సీపీ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. గల్ఫ్ ఏజంట్లు చేస్తున్న మోసాలను ఎదిరించి పోరాటం చేస్తున్న ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహం నాయుడికి డిసెంబర్ 30నుండి చంపుతామని బెదిరింపు కాల్స్ వస్తూనే ఉన్నాయి. ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో డిసెంబర్ 31న ఫిర్యాదు చేసినప్పటికీ జనవరి 20 వరకు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయలేదు. జనవరి19న సీపీకి

ఫిర్యాదు చేసిన తర్వాతనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కానీ ఇంతవరకు నిందితులను గుర్తించలేదు. తాజాగా ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి కాల్ చేసి 'మొన్న నువ్వు దుబాయిలో ఉన్నప్పుడు చంపేద్దామని తిరిగాం.. నీ నెంబర్ లేక ఉంటున్న అడ్రస్ తెలియక బతికిపోయావు.. నీ అంతు చూస్తాం' అని బెదిరించారు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేసి తనకు గన్‌మెన్‌ల ద్వారా రక్షణ కల్పించాలని కోరారు. ఇటీవల వందలాదిమంది ని మోసగించిన షేక్ బషీర్ అనే ఏజంట్లు మీద ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఆయన్ను, అనుచరులను గాని పట్టుకోవడంలో డిచ్ పల్లి పోలీసులు సఫలం కాలేదు. బాధితులతో కలిసి మరొకసారి సీపీకి ఫిర్యాదు చేశారు. వెంటనే షేక్ బషీర్, నిజామాబాద్ లో మెడికల్ టెస్ట్ పేరుతో ప్రతి ఒక్కరి నుండి 5600 అక్రమంగా వసూలు చేసిన విజయ శ్రీ డయాగ్నొస్టిక్ సెంటర్ పై చర్యలు తీసుకొని బాధితులకు డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. మహమ్మద్ ఇబ్రహీం తదితరులు సిపిని కలిసిన వారిలో ఉన్నారు.

ఉత్తర తెలంగాణను ఎడారిగా మార్చే కుట్ర

కాంగ్రెస్ నాయకుడు కోలా వెంకటేష్

నవతెలంగాణ-ఆర్మూర్

ఉత్తర తెలంగాణను ఎడారిగా మార్చేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ నాయకులు డీసీసీ డెలిగేట్ కోలా వెంకటేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాందేడ్ సభలో సీఎం కేసీఆర్ చేసిన వాఖ్యలపై ఆయన స్పందించారు. కేసీఆర్ అక్కడి మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రకు బాబ్లీ ద్వారా శ్రీరాంసాగర్ నుండి నీటిని ఎత్తిపోసుకొని తీసుకోవెళ్ళుమని చెప్పాడని, దీనిని కాంగ్రెస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్పీ నుండి ఒక్క చుక్క నీరు మహారాష్ట్రకు తరలించాలని చూసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను గ్రామాల్లో తిరగనివ్వబోమని తెలిపారు. ఉద్యమ సమయంలో నీళ్ల పేరు మీద ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు మన నీళ్లను మహారాష్ట్రకు ఇస్తా అంటే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని పేర్కొన్నారు. తెలంగాణకు నీళ్లు రాకుండా అడ్డుగా మహారాష్ట్ర వారు బాబ్లీ ప్రాజెక్టు కడితే ఏరోజు పోరాటం చేయని సీఎం అదే మహారాష్ట్రకు ఎస్ఆర్ఎస్పీ నీళ్లు ఎత్తిపోసుకొని తీసుకువెళ్ళమనడం ఉత్తర తెలంగాణ పట్ల మీకు ఉన్న వివక్షకు నిదర్శనమని తెలిపారు. ఉత్తర తెలంగాణ రైతులు, ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

సరిచేసిన ఇండికేటర్ లైట్

నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-భిక్కనూర్





వంగిన ఇండికేటర్ స్థంబాన్ని సరిచేసిన సిబ్బంది

44వ జాతీయ రహదారిపై భిక్కనూర్ పట్టణ శివారు లో పోలీస్ స్టేషన్ వెనకాల ఇండికేషన్ లైట్ ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా ఉండడంతో నవతెలంగాణ దినపత్రికలో " ప్రమాదం అంచున ఇండికేటర్ లైట్" అనే శీర్షికన కతనం ప్రచురించింది. దీనికి స్పందించిన జాతీయ రహదారి సంస్థ పర్యవేక్షకులు వెంటనే స్పందించి ఇండికేటర్ లైట్ ను సరి చేశారు. ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారి పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-రామారెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న వైద్యులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు సురేష్ విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్లో సోమవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తగిన మందులను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ... పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత, వేడి చేసి చల్లార్చిన నీటిని సేవించాలని, జ్వరము, జలుబు ఉన్నవారిని ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, రక్తహీనత ఉన్న వారికి రాగి జావా, పల్లి పట్టీలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది భీం, దోమల శ్రీధర్, శ్రీహరి, లింబమ్మ, వనిత, రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం బంజారాలను గుర్తించి సేవలాల్ మహరాజ్ జయంతి అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని లంబాడి ఐక్యవేదిక కామారెడ్డి జిల్లా యూత్ ఇన్చార్జి అనిల్ నాయక్ తెలిపారు. సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈనెల 15న జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతిని పునస్కరించుకొని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని ఆయన కోరారు.

పద్మశాలి యువజన సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

పట్టణ పద్మ శాలి యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకు న్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా ఐరేని సందీప్ కుమార్ , వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చెలిమల భాను ప్రసాద్, ఇప్పకాయల రాజు అధ్యక్షుడిగా పొలాస సురేష్, ప్రధాన కార్యదర్శిగా సామల నాగ శ్రీను, కోశాధికారిగా సబ్బని మదన్ ,ఉపాధ్యక్షులుగా చాట్ల వేణు, జడల రజినీకాంత్, గాజుల నరేష్, బొమ్మెర సాయినాథ్, బొమ్మెర వేణు గోపాల్ , సహాయ కార్యదర్శిగా గౌరిటాల ప్రకాష్, ఎలిగేటి భాను ప్రసాద్, చిటిమెల అరవింద్, రేగొండ విజయ్, మ్యాకల రాకేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ కో కన్వీనర్ గర్దాస్ గోవర్ధన్, రఘు, పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్షులు చాట్ల రాజేశ్వర్ ప్రధాన కార్యదర్శి తుమ్మ రమేష్, జిల్లా సెక్రెటరీ బొమ్మల రాజయ్య, పడిగే శ్రీనివాస్, చౌకి లక్ష్మీ నరసింహులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల పరిషత్ అధికారి ప్రవీణ్ కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆవరణను పరిశీలించి, పరిశుభ్రత పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ లావణ్య, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ ఉన్నారు.

అనంతరం జంగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలను కంటి పరీక్షలు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుడిసె బాబు, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పీఓడబ్ల్యూ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ఒడ్డాట్‌పల్లి గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు కవిత ఆధ్వర్యంలో పీఓడబ్ల్యు రాష్ట్ర మహాసభ పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో మహబూబబాద్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 25 సంవత్సరాలుగా పోరాడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. మహిళలు వారి హక్కులను సాధించుకోవడానికి అనేక పోరాటాలు పీఓడబ్ల్యూ చేస్తుందని తెలిపారు. స్త్రీ, పురుష సమానత్వానికి సమాన పనికి సమాన వేతం ఇవ్వాలని ఆమె అన్నారు. నిజామాబాద్ జిల్లా నుండి మహిళలు మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గంగు, కళావతి, సౌందర్య, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

తోట భాస్కర్‌కు నివాళి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో సోమవారం తోటభాస్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంసిపిఐ (యు) బోధన్ డివిజన్ నాయకులు మల్యాల అనిల్ కుమార్ మాట్లాడుతూ తోట భాస్కర్ పేద ప్రజలకు ఇళ్ల స్థలాల సాధనలో, నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీలో, వామపక్షాల ఉద్యమాలలో, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బలోపేతంలో, భవనిర్మాణరంగ కార్మికుల హక్కుల కోసం, గ్రామీణ ప్రజల సమస్యలపై , మున్సిపాలిటీలో నెలకొని ఉన్న మురికివాడలోని పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలుచేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు షేక్ కరీం, తోట సంగీత, సుశీల, రామ్మూర్తి, రవి, సాల్మన్ రాజు, ఏసుదాసు, సాంబయ్య, సాగర్ , చిరంజీవి, ఎస్ ముత్తయ్య, దానయ్య, యార్లగడ్డ సాయిబాబా, రాజ్ పాల్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగ బడ్జెట్ ప్రతులు దహనం

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ/ఆర్మూర్/బోధన్

తెలంగాణ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన 2023- 24 బడ్జెట్లో విద్యారంగానికి 2 శాతం, 6.5 శాతం నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సోమవారం పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలను ప్రభుత్వ గిరిరాజ్ కళాశా లలో దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర అధ్యక్షులు ఎస్కే. అఫ్జర్ మాట్లాడుతూ కొటారి కమిషన్ ఇచ్చినటువంటి నివేదికలో కేంద్ర బడ్జెట్లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని రాజ్యాంగం ద్వారా ఆమోదించబడిందని తెలిపారు. బడ్జెట్‌లో నిధులను తగ్గించడం విద్యను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేయడమేనని అన్నారు. పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయంబర్స్మెంట్, మెస్ బిల్లులు 3800 కోట్ల రూపాయలు బకాయి విడుదల డిమాండ్ చేశారు. నూతన వసతి గృహాల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉన్నత స్థాయి విద్యార్థులకు నెలకు 3000 రూపాయల స్కాలర్షిప్ ఇవ్వాలని, పరిశోధన స్థాయి విద్యార్థులకు నెలకు పదివేల రూపాయల ఫెలోషిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల కేటాయించాలని, మహిళా డిగ్రీ కళాశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్లో సవరణలు చేసి విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం 10 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం బలికాక తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో.. పిడిఎస్యు నగర సహాయ కార్యదర్శి వేణు, కోశాధికారి తిరుమలేష్, నాయకులు చరణ్, సందీప్, రాజేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్:తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి తక్కువ శాతం నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, నిఖిల్ మాట్లాడుతూ.. కొఠారి కమిషన్ సిఫారసులను అమలు చేస్తానని కేసీఆర్ హామీలిచ్చి ఇప్పుడు ప్రభుత్వ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ కార్పొరేట్ విశ్వవిద్యాలయాన్ని కార్పొరేట్ విద్యావ్యవస్థకు స్వాగతం పలుకుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఏరియా ఉపాధ్యక్షుడు నవీన్, నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

బోధన్:తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్లో విద్య రంగానికి సరిపడా నిధులు మంజూరు చేయక తీవ్ర అన్యాయం చేసిందని పిడిఎఫ్ నాయకులు విమర్శించారు ఈ సందర్భంగా సోమవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బడ్జెట్ ప్రజలను దానం చేశారు అనంతరం పీడీఎస్ యూ రాష్ట్ర కార్యాయదర్శి ఆజాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో విద్యకు మరోసారి తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. గతంలో లాగే హరీష్ రావు బడ్జెట్ ప్రసంగం హంగు ఆర్భాటాలు, అంకెల గారడీ ప్రసంగం మాత్రమేనని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా చేసే కుట్రపూరిత బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆశుర్, నాయకులు సాయి కృష్ణ, మురళి, కృష్ణ వంశీ సంపత్, నంది, వినోద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నవతెలంగాణ-ఎడపల్లి

గతనెల 28న ప్రారంభమైన మండలంలోని జానకంపేట గ్రామ శివారులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం జాతర చక్రతీర్థం, కుస్తీ పోటీలతో ముగిశాయి. కుస్తీ పోటీలో పాల్గొనేందుకు సుదూర ప్రాంతాల నుండి మల్ల యోధులు తరలివచ్చారు. అష్టముఖి కోనేరు వద్ద, ఆలయంలో భక్తులు ఇబ్బందులు పడకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం చక్రతీర్థం సాయంత్రం కుస్తీ పోటీలను నిర్వహించారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కుస్తీ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి నగదును ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ అధికారులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, ఆలయ కమిటీ అధ్యక్షులు పురం సాయిలు జానకపేట సర్పంచ్ పొట్టోళ్ల సాయిలు, ఎంపీటీసీ సభ్యులు మంద సంజీవ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.


కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

ఉపాధి కూలీలకు 200 రోజులు పనికల్పించాలి

నవతెలంగాణ-భీంగల్

ఉపాధిహామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలని ఏఐకేయంఎస్ నాయకులు రాజేశ్వర్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈమేరకు సోమవారం పట్టకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిఓ గంగమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్రప్రభుత్వం ప్రజలకు ఉపాధిని చూపాల్సిందిపోయి జాతీయ గ్రామీణ ఉపాధి హమీ చట్టాన్ని ఎత్తివేయాలని చూడడం సరికాదని అన్నారు. పైగా నామమాత్రంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం పథకాన్ని నిర్వీర్యం చేయడంలో కుట్ర అని అన్నారు. వినతిపత్రం అందించిన వారిలో గంగాధర్, అశోక్, శ్రీనివాస్, మోహన్ తదితరులున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్(ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర మహాసభలో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా దాసు, ఉపాధ్యక్షులుగా ఎండి కాజా మొయినొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా జటంకి వెంకన్న, సహాయ కార్యదర్శిగా లింగస్వామి, కోశాధికారిగా అశోక్, మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, ఖమ్మం, పెద్దపల్లి, సూర్యపేట్, మంచిర్యాల్, నిర్మల్ జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభ ఈ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించింది.గ్రామపంచాయతి కార్మికుల వేతనాలు పెంచి వెంటనే పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానించిందని చెప్పారు. నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను వెనక్కి తీసుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, 12 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని తీర్మానించిందని తెలిపారు. పంచాయతీ కార్మికులకు డబుల్ బెడ్ రూమ్ పథకంలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, నరేంద్ర మోడీ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో సఫాయి కార్మికులకు ప్రత్యేక నిధిని కేటాయించాలని తీర్మానం చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ సమావేశాల సందర్భంగా పంచాయతి కార్మికులకు ఉపాధి భద్రత చట్టాలను చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. మార్చి 25, 26 తేదీల్లో మంచిర్యాలలో జరిగే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు.



ఉపాధి హామీకి బడ్జెట్‌ను పెంచాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో జాతీయ ఉపాధి హామీ పథకానికి తక్కువ కేటాయించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్‌వద్ద ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపి రామకష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీకి 2లక్షల75వేల కోట్ల రూపాయలకు బడ్జెట్ ను పెంచి, ప్రతి వ్యవసాయ కార్మికుడికి 200రోజులు ఉపాధికల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టం అమలు చేసి, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పి రాజేశ్వర్, వడ్డెన్న, సహాయ కార్యదర్శులు, ఎస్.కె, నసీర్, ఎం సాయా రెడ్డి, భూమన్న చిన్న పోశెట్టి, పాల్గొన్నారు.

పశుమిత్రలకు పారితోషికం నిర్ణయించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పశు మిత్రులకు పారితోషికం నిర్ణయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న పశుమిత్రులకు పారితోషకం నిర్ణయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, వెట్టి చాకిరీ నిర్మూలించాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలాంటి పారితోషకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వెట్టి చాకిరి చేయించు కుంటుందన్నారు. ఈ డిపార్ట్మెంట్లో రాష్ట్రవ్యాప్తంగా 2500 మంది పశు మిత్రులు 8 సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇందులో ఎక్కువ మంది మహిళలే ఉన్నారని అన్నారు. వీరికి తన ఊరితోపాటు సబ్ సెంటర్ పరిధిలోని పశువులకు రాత్రనక పగలనక ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లి వైద్యం చేస్తున్నారన్నారు. టీకాలు వేయటం, నట్టల మందు వేయటం, తదితర సేవలు అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వేతనం తీసుకొని ఆడపడుచులకు వేతనం ఇవ్వక పోవటం దుర్మార్గమని అన్నారు. తక్షణమే అసెంబ్లీ సమావేశాల్లో ఫిక్స్ వేతనం, యూనిఫారం, గుర్తింపు కార్డ్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పారితోషికం నిర్ణయం చెయ్యాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే మహిళా కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకోవడం సిగ్గుచేటని అన్నారు. రాబోయే రోజుల్లో పోరాటం ద్వారా హక్కులు సాధించుకుంటామని తెలిపారు. సమావేశంలో పశుమిత్రలు మౌనిక లక్ష్మి మమత జ్యోతి, నవిత, కవిత, అరుణ మౌనిక సంగీత నాగమణి సుధారాణి శ్యామల సుకన్య రోజా రాణి అనిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూర్జహాన్

ఇండ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయండి

- ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-బోధన్

సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలో వేలాదిమంది కిరాయి ఇండ్లలో నివసిస్తూ అద్దె కట్టలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్న బోధన్ నియోజకవర్గంలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని అన్నారు . మోసపూరిత హామీలతో ప్రజలకు ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు . ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇస్తానన్న కేసీఆర్ ప్రభుత్వం మూడు లక్షలు ఇస్తామనడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. పది లక్షల ఉంటే గాని ఇల్లు పూర్తికాని ప్రస్తుత పరిస్థితుల్లో దానిని తగ్గించడం సిగ్గుచేటని అన్నారు. స్థలం కలిగిన వారికి వెంటనే ఐదు లక్షల రూపాయల రుణం మంజూరు చేయాలని అన్నారు. బోధన్ పట్టణంలోని వార్డ్ నెంబర్ 1 పాండు ఫారంలో గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు వెంటనే ఇంటి పట్టాలను ఇచ్చి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అలాగే ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల లోను ఇవ్వాలని డిమాండ్ చేశారు . లేకుంటే స్థలాన్ని ఆక్రమించుకొని గుడిసెలు వేసుకుంటారని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్ కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దాసి రవి, ఎస్ గంగాధర్ ,ఐద్వా నాయకులు లక్ష్మి, సాయమ్మ, ఎర్రమ్మ ,సుజాత, వికలాంగుల నాయకురాలు సావిత్రి ,గుంత రవి, వాజిద్, వినోద్ పాల్గొన్నారు.



ఇండ్ల నిర్మాణాలకు నిధులు మంజూరుచేయాలని ధర్నా చేస్తున్న పేదలు

క్రాప్‌లోన్ వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ సొసైటీలో క్రాఫ్ లోన్ ఉన్నవారు వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి సోమవారం తెలిపారు. సంవత్సరం లోపు వడ్డీ కట్టినవారికి 7శాతం వడ్డీ వర్తిస్తుందని, సంవత్సరం దాటిన వారికి 13శాతం వడ్డీ చెల్లింలి రెన్యువల్ చేసుకోగలవాలని కోరారు. లేదంటే తనకా పెట్టిన భూములు జప్తు చేస్తారని గమనించాలని తెలిపారు.

దేశం మొత్తం కేసీఆర్ వైపు చూస్తుంది

- ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్

నవతెలంగాణ-మోపాల్

దేశం మొత్తం కేసీఆర్ వైపు చూస్తుందని, నాందేడ్ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఆశయాలకు మధ్యన ఎవరు రావద్దన్న విజన్‌తోనే ముఖ్యమంత్రి కేసీఆర్ నాందేడ్‌లో పెట్టిన సభకు ఇక్కడి నుండి బిఆర్ఎస్ పార్టీ నాయకులకు తీసుకెళ్లలేదని, ఇది ఆయన విజన్‌కు నిదర్శనమని

జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘ సభ్యులు, ధర్పల్లి జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ స్పష్టం చేశారు. నిజామాబాద్ రూరల్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ బిజెపి చీఫ్ బండి సంజయ్‌కు కండ్లు కనిపించడం లేదేమోనని నాందేడ్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సభ సక్సెస్ కాలేదని స్టేట్మెంట్ ఇచ్చారని, మేము ప్రధానిగా మోదినే గుర్తించడం లేదని ఇటువంటి నాయకులను పట్టించుకోమని అన్నారు. కానీ ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్లొద్దని మాట్లాడాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ గురించి ఏడాదిపాటు గ్రౌండ్ వర్క్ చేసి 300కోట్లు ప్రభుత్వం నుండి ఇస్తానని, రైతులు సొసైటిగా ఏర్పడి ఫ్యాక్టరీని నడిపించుకోవాలని అవకాశం కల్పించారని తెలిపారు. ఎంపి అర్వింద్ పసుపు బోర్డు తీసుకొస్తానని చెప్పి స్పైసి బోర్డు తెచ్చినా అంటూ మాయ మాటలు చెబితే రైతులు ఉర్కించి కొట్టారని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమి రాలేదని ప్రజలు తెలుసుకున్నారని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుండి నిధులు తెచ్చే మొహం లేదు గాని, అబద్ధ ప్రచారాలు చేసుకుంటూ ఇది చేస్తాం అది చేస్తాం అంటున్నాని, రాబోయే రోజుల్లో ప్రజలు బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. కనీసం ఇప్పటివరకు కొత్తగా ఒక్క రైల్వే కూడా ఏర్పాటు చేయని ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వం అని ఆయన మండిపడ్డారు, కేసీఆర్‌పై గాని ఆయన కుటుంబంపై విమర్శలు చేస్తే తాము సహించబోమని ఆయన హెచ్చరించారు. అరవింద్‌కివే చివరి ఎన్నికలని ఆయన అన్నారు. అసెంబ్లీలో రూ.2,90,396 కోట్లతో తెలంగాణ బడ్జెట్ ప్రవేశ పెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో మోపాల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, కెసిఆర్ సేవాదళ్ కన్వీనర్ కోర్వ దేవేందర్, సిరికొండ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఆకుల తిరుమల, బర్ధిపూర్ సర్పంచ్ పద్మారావు, నుడా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాజిరెడ్డి జగన్

కలెక్టర్‌ను కలిసిన సీపీఐ(ఎం)జిల్లా బృందం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇటీవల జిల్లాకు నూతనంగా వచ్చిన జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, సబ్బని లత, జిల్లా కమిటీ సభ్యులు పి.సూరి కలిసి పూల బొకే ను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన ప్రజా సమస్యల పరిష్కారం పట్ల దృష్టి పెట్టాలని కోరారు. ప్రధానంగా పేదలు. అసంఘటిత కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కారం చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న సమస్యల పట్ల అవగాహన చేసుకుని పరిష్కారానికి కషి చేస్తానని కలెక్టర్ తెలిపారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ

నవతెలంగాణ-ఏర్గట్ల

2022-23 వార్షిక ప్రణాళికలో భాగంగా మైనార్టీ కార్పొరేషన్ కింద మండలంలోని దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10 న శుక్రవారం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందని ఎంపీడీఓ రాజేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలో పాల్గొనే దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు పట్టకుని ఆత్మహత్య

నవతెలంగాణ-నందిపేట్

ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌ను పట్టుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... మండల కేంద్రంలోని మల్లారం గ్రామానికి చెందిన మోర్తాడ్ ప్రశాంత్ (23) ఆదివారం లేబర్ పని ముగించుకొని రాత్రి 8 గంటల ప్రాంతంలో కొత్తపల్లి-కంఠం మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మతిని తల్లి , సోదరుడు మానసికస్థితి బాగలేక చనిపోయారని, దీంతో మృతుడు మనస్తాపం చెంది తనకు తానుగా ట్రాన్స్‌ఫార్మర్ కరెంట్ వైరుని పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మతుడికి ఇంకా పెళ్లి కాలేదు. మతుడి మానసిక పరిస్తితి కూడా కొంత కాలంగా బాలేదని గ్రామస్థులు చెప్పారని అన్నారు. మతుడు తండ్రి నర్సయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

నవతెలంగాణ-ఎడపల్లి

ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని జమలం గ్రామానికి చెందిన వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ సయ్యద్ వివరాల ప్రకారం... వేరువల్లి గంగాధర్ (40) తాగుడికి బానిసయ్యాడు. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో జీవితంపై చెందాడు. ఈక్రమంలో ఈనెల ఒకటిన రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి వెళ్లి గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఆచూకీ తెలియక కుటుంబసభ్యులు బంధువులు, తెలిసినవారి వద్ద ఆరాతీశారు. చివరకు ఆదివారం జమలం గ్రామ చెరువులోనే ఆయన మృతదేహం నీటిపై తేలింది. ఇది గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులువచ్చి మతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి జీవిత ఖైదు

నవతెలంగాణ -బోధన్

కట్టుకున్న భార్యను కల్లు సీసాతో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు సోమవారం బోధన్ కోర్టులో న్యాయమూర్తి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమయ్య తెలిపిన వివరాల ప్రకారం సాలూర మండలానికి చెందిన గంగామణి తన చెల్లెలు చనిపోవడంతో తన కూతురు సవితను చందూరు మండలానికి చెందిన పసుపు శ్రీనివాస్ కు ఇచ్చి పది సంవత్సరాల క్రితం వివాహం చేసింది. వీరికి ఇద్దరు కూతుళ్ల ఉన్నారని, మద్యానికి బానిస అయిన శ్రీనివాస్ భార్యను వేధించాడు. ఈ క్రమంలో కుటుంబంలో గొడవలు రావడంతో పెద్దమనుషుల సమక్షంలో నచ్చజెప్పారు. శ్రీనివాస్ భార్యను కొట్టడంతో వర్ని పోలీస్ స్టేషన్‌లో 2020లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరువురికి కౌన్సెలింగ్ చేసి బాధితురాలి స్వగ్రామం సాలురకు పంపారు. అయితే తన భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం మనసులో పెట్టుకున్న నిందితుడు ఆమె నిద్రిస్తుండగా కల్లు సీసాతో కడుపులో పొడిచి పారిపోయాడు. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో బోధన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులు బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై భువనేశ్వర్ రావు కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో సోమవారం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య పోలీసుల తరపున సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి దేవాన్ అజయ్ కుమార్ నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, వందరూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని ఎడల 15 రోజులపాటు సాధారణ జైలు శిక్ష విధించడం జరుగుతుందని న్యాయ మూర్తి తీర్పు వెల్లడించారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మైనార్టీ కార్పొరేషన్ కింద రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 29 మంది లబ్దిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ గౌతమి మాట్లాడుతూ మైనారిటీ కార్పొరేషన్ కింద వచ్చిన రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ మైలారం గంగాధర్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సతీష్ యాదవ్, యూనియన్ బ్యాంకు మేనేజర్, పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు

'ప్రజావాణి' ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- ఫిర్యాదులు, వినతలుపై

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 109 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జెడ్పి సీఈఓ గోవింద్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీలను వెంటదివెంట పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలు పక్కాగా అమలయ్యేలా చూడాలి

ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలు జిల్లాలో పక్కాగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులకు వివిధ అంశాలపై మార్గనిర్దేశం చేశారు. మండల ప్రత్యేక అధికారులు వారంలో కనీసం రెండు పర్యాయాలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, మన ఊరు - మన బడి, కంటి వెలుగు, హరితహారం, ఆస్తి పన్ను వసూళ్ల ప్రగతి, వార్షిక పరీక్షల సన్నద్ధత వంటి అంశాలను నిశితంగా పరిశీలించాలన్నారు. క్షేత్ర పర్యటనలో గమనించిన అంశాలను సంబంధిత మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని హితవు పలికారు. ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో ఆస్తి పన్ను నిర్దేశిత లక్ష్యం మేరకు రాబట్టేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. హరితహారం కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని, రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు పాడైన వాటి స్థానంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేయించాలన్నారు.. పదవ తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపించినందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. సమాచారాన్ని పరస్పరం పంచుకునేందుకు వాట్సప్ గ్రూప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

ఉపాధిలో హామీ పై సామాజిక తనిఖీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పై 13వ సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీపీ మాధవి బాలరాజు గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. 2019 నుంచి 2022 సంవత్సరానికి రూ.14కోట్ల ఖర్చుపెట్టిన నిధులపై ప్రజా వేదికలు అధికారులు నిర్వహించారు. గత గత మూడు సంవత్సరాలుగా జరిగిన పనులపై డిఆర్పీలు,ఎస్ఆర్పిలు నివేదిక చదివి వినిపించారు.ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన సమావేశం సాయంత్రం 7 గంటల వరకు సాఫీగా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా డిఆర్డిఓ సాయన్న మాట్లాడుతూ... మండలంలోని 31 గ్రామ పంచాయితీల వారిగా సమీక్ష నిర్వహించారు. 2019-22 మధ్య కాలంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం అవినీతి అక్రమాలు, పనుల్లో నాణ్యత లోపం అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం సభ్యుల తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ మూడు ఆర్థిక సంవత్సరాలలో 14 కోట్ల తో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, పంచాయతీరాజ్ శాఖ పనులు,రూరల్ వాటర్ సప్లై, పనులు సర్వ శిక్ష అభియాన్ పనులు, సోషల్ ఫారెస్ట్ పనులు చేపట్టినట్లు అధికారులు తెలియజేశారు. 31 గ్రామాలకు సంబంధించిన పనులను గ్రామాలు వారిగా సంబంధిత స్టాప్ ను పిలిచి వారి నుంచి సమాచారాన్ని రాబట్టి పూర్తి వివరాలు నమోదు చేసుకుందామన్నారు

రిలే దీక్షలలో విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకు బోధన పట్టణంలో బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షల్లో సోమవారం విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. దీక్షలను స్థానిక వామ పక్ష నాయకులు మల్లేష్, యాదగిరి గౌడ్, ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ తలండే ఈశ్వర్ ప్రాంభించారు. ఈ శిబిరంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్ మాట్లడుతూ జిల్లా ఉద్యమం న్యాయమైందని అన్నారు. ప్రభుత్వం వెంటనే బోధన్‌ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధీక్షలో చైతన్య ఒకేషనల్ కాలేజీకి చెందిన విద్యార్థిని విద్యార్థులు ఏ.కవిత, సాక్షి, బి.గౌతమి, కె.అరుణ, ఆర్.స్వప్న, ఎల్.చంటి, జె.ఓంకార్, బి.శశాంక్, ఏ. అభిషేక్, పి.వాసులతో కలిపి 50మంది పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్.గంగారెడ్డి సి.హెచ్.వి హన్మంత్రావు,అర్జున్ ర్యాండర్, గిరిధర్ రాజ్,అడ్లూరి శ్రీనివాస్, బాణోత్ రమేష్, తర్ల శంకర్, నాయక్ సాయిలు, జాదవ్, గురుశక్తి అనిల్, గుమస్తా లు, శ్రీనివాస్, జమీర్, ఖైసర్,అన్వర్, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై ప్రత్యేక పూజలు



మహిళల ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై సోమవారం జక్రాన్ పల్లి జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదానం 50వ వారానికి చేరుకుంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పండిత్ ప్రేమ్, పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, కౌన్సిలర్లు తాటి హనుమాన్లు, శివకుమార్, బరాడు రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగు శేఖర్ రెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై చర్చా గోష్టి



మాటాత్లడుతున్న ప్రొఫెసర్ విద్యావర్ధిని

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్వదేశీ జాగరణ మంచ్,తెలంగాణ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మేనేజ్మెంట్ విభాగంలో 2023-24 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై చర్చా గోష్టి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సభాధ్యక్షత డాక్టర్.నారాయణ నిర్వహించిన ఈ కార్యకమనికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విద్యావర్ధిని పాల్గొని మాట్లాడుతూ దేశ బడ్జెట్ అంటేనే మొబైల్, టీవీ, బంగారం ధరలు పెంపు, తగ్గింపు లే కాదని ప్రతి విభాగానికి, ప్రజలకు ఎంతమేర కేటాయించారు. ఎలా వినియోగిస్తున్నారో కూలంకషంగా తెలుసుకోవాలన్నారు.

విశిష్ట అతిథులు డా.ఆంజనేయులు,రవీందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఆర్థిక సంస్కరణల కాలం వరకు,ఆ తరువాత జరిగిన బడ్జెట్ ల లోటు పాట్లపై వివరించారు. గౌరవ అతిథిగా జి.రణజీత్ మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వాడకం పై వచ్చిన ఉద్యమాలు, స్వాతంత్ర్య కాంక్ష బలపడడానికి గల కారణాలను వివరించారు.

ప్రధాన వక్త గా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక,ఆర్థిక శాస్త్ర సహాయ ఆచార్యులు డా.సత్తు లింగమూర్తి మాట్లాడుతూ ఫిబ్రవరి 1, 2023న 45.03 లక్షల కోట్ల వ్యయంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన 2023-24 యూనియన్ బడ్జెట్ అమత కాలానికి తొలిమెట్టుగా భావించవచ్చని, ఇది భారతదేశ ఆర్థిక స్థిరత్వాన్ని, సమ్మిళిత అభివద్ధిని సూచించే విధంగా ఉందని, కరోనా మహమ్మారి,రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో ఉన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 6.8శాతం ఆర్థిక వద్ధి సాధిస్తుందని 2023 ఆర్థిక సర్వేలో పేర్కొనడం భారత దేశ ధృఢమైన ఆర్థిక నిర్మాణానికి చిహ్నమన్నారు. విశిష్ట అతిథులుగా డాక్టర్ ఆంజనేయులు యూజీసీ సెల్ డైరెక్టర్, డాక్టర్ కె.రవీందర్ రెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్, తెలంగాణ యూనివర్సిటీ శాఖ కార్యకర్తలు, ఒప్పంద అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు, ప్రొఫెసర్‌లు, అధాక్యపకులు

కన్నుల పండుగగా రాములోరి చక్రతీర్ధం

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఖిల్లా రామాలయ బ్రహ్మో త్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగు తున్నాయి. సోమవారం శ్రీ సీతారామ చంద్రులకు చక్రతీర్థం కన్నుల పండువగా నిర్వహిం చారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిత్యహోమం నిర్వహించారు. మండలం నుంచే కాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామాలయ చైర్మన్ ప్రొద్దుటూరి మహేందర్ రెడ్డి, సర్పంచి గడ్డం రాధాకష్ణా రెడ్డి, ఉప సర్పంచ్ ఆసది రవీందర్, ఎంపీటీసీ కొత్తురు మానససాయి, విండో చైర్మెన్ గజవాడ జైపాల్, వీడిసి కోశాధికారి బూస నర్సయ్య (బక్కన్న), రైటర్ గట్టవలి సాగర్, ఆలయ కమిటీ సభ్యులు కందగిరి వినోద్, నల్ల నిర్మల హరికిషన్, ఆసది జయసుధ, పంచాయితీ కార్యదర్శి వినయ్, ఆర్చకులు సుమిత్ శర్మ దేశ్పాండే, ప్రదీప్ దేశ్పాండే, మంత్రి శ్రీధరాచార్యులు, ఆష్లేషాచారి. పుష్పక్ పాండే, దిరాజ్ కులకర్ణి, గోపాల్, దేశ్ పెద్ది ప్రవీణ్ రావు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



రంగుల రట్నం ఎక్కిన సందర్శకులు

16 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు



తాగి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 16 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడిన 16 గురిపై కేసు నమోదు చేసుకొని వారితోకలిపి 26 మందికి సోమవారం నగరంలోని జిల్లా టిటిఐ కౌన్సిలింగ్ సెంటర్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

నేడు రాంపూర్‌లో పలు ప్రారంభోత్సవాలు

ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్సీ రాక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డిచ్ పల్లి మండలంలోని రాంపూర్ డి గ్రామంలో పలు అభివద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ తో కలిసి మంగళవారం వస్తున్నట్టు సర్పంచ్ పాపాయి తిరుపతి, ఉప సర్పంచ్ యెంకనోల్ల రమేష్, సహకార సొసైటీ చైర్మన్ తరచంద్ నాయక్ వేర్వేరుగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్ గ్రామంలో వద్ధాశ్రమం భవనం, పశు వైద్యశాల భవనం, శ్మశానవాటిక, అంగన్‌వాడీ భవనాలు, కమ్యూనిటీ హాలు భవనాలు, సిసి రోడ్, డ్రైనేజ్, కుల సంఘ భవనాలు, సహకార సొసైటీ మడిగెల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వారు వివరించారు. మిగిలిన వాటికి నీదులు మంజూరు చేస్తారనే భరోసా తమకుందని తెలిపారు.